క్లుప్తంగా

‘శ్రీకరి’ మోడల్ హౌస్‌ను ప్రారంభించిన బాలినేని



శ్రీకరి విల్లాస్ మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక వెంగముక్కలపాలెం రోడ్డులోని శ్రీకరి విల్లాస్ మోడల్ హౌస్‌ను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మనుమడు సిద్దాన్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 39.50 ఎకరాల్లో మూడు బెడ్‌రూమ్లు, నాలుగు బెడ్‌రూములు, ఐదు బెడ్‌రూముల విల్లాస్ 209 నిర్మాణం జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి మోడల్ విల్లా ఎక్కడా లేదని తెలిపారు. శ్రీకరి డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విల్లాల్లో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, పార్క్, వాకింగ్ ట్రాక్‌తో పాటు కిడ్స్‌ప్లే పార్కు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో 209 విల్లాల నిర్మాణం జరుగుతోందని, మొదటి ఫేజ్‌లో 109 విల్లాలు పూర్తిచేయడం జరిగిందని వివరించారు. మొత్తం ప్రాజెక్టును 2024 మార్చికల్లా పూర్తిచేయడం జరుగుతుందని బాలినేని పేర్కొన్నారు.



శ్రీకరి విల్లాస్ మోడల్ హౌస్

నేడు ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే బాలినేని పర్యటన

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం ఒంగోలు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక గాంధీ రోడ్డులో, 9.30 గంటలకు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో నిర్వహించే గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. 10 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించే గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో బాలినేని పాల్గొంటారు.

ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలో గల ఎస్‌యూవీఆర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగానూ ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వి.ఏసుప్రసాద్‌రావు తెలిపారు. అక్టోబర్ 3 ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. పాలీసెట్ 2023 ఎంట్రెన్స్ రాసి అర్హులై కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు, ఎంట్రెన్స్‌లో క్వాలిఫై కానీ వారు, దరఖాస్తు చేసి పరీక్ష రాయని వారితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా స్పాట్ అడ్మిషన్లకు అర్హులని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు వారి సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. రూ.4,700 ఫీజు చెల్లించాలని, పూర్తి వివరాలకు 94418 85492 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్న కేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, తదితరులు పర్యవేక్షించారు.

కొనకనమిట్ల: మహాలయ పక్షాన్ని పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు, గార్లదిన్నె గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో గ్రామప్రజల ఇలవేల్పు అంకాళమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

- పలువురు వక్తల పిలుపు
- పెద్ద ఎత్తున స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న పేస్ కళాశాల ఎన్‌సీసీ బృందం



పేర్నమిట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను ఆదివారం పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. స్థానిక పేస్ కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు వల్లూరు వద్ద గల కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్, గాజు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ భూతంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి నివారించాలని 34 ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ కె.సత్యనారాయణ సూచించారు. విద్యార్థులకు జీవితంలో క్రమశిక్షణ, పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన రావు, కళాశాల ఏఎస్‌ఓ పృధ్వీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

నగరంలోని కలెక్టరేట్, అంబేడ్కర్‌భవన్, దేవుని చెరువు పార్క్, శర్మ కాలేజీ, తదితర ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, నాయకులు పాల్గొని చీపురు పట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

జిల్లా జైలులో...

ఒంగోలు టౌన్: జిల్లా జైలులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి పాల్గొని మాట్లాడారు. కారాగార సిబ్బందితో కలిసి జైలు ప్రాంగణం, పరిసరాలలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో జైలు వైద్యాధికారి బ్రహ్మతేజ, జైలర్ వి.రమేష్, సీనియర్ అసిస్టెంట్ షేక్ సుభాని బాషా, చీఫ్ హెడ్ వార్డర్ బీమా శ్రీనివాసరావు, గార్డింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇనమనమెళ్లూరు గ్రామంలో పాల్గొన్న ఎంపీపీ అరుణ...

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని కచేరీ సెంటర్‌లో గంటసేపు రోడ్లు ఊడ్చి శ్రమదానం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, నైనాల శ్రీనివాసరావు, పల్లబోతు హనుమంతరావు, గంగిశెట్టి శేషయ్య, సచివాలయ కార్యదర్శి విజయ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలే గాంధీకి నిజమైన నివాళి...

చీమకుర్తి: స్వచ్ఛత హీ సేవలే గాంధీజీకి ప్రజలు అర్పించే నిజమైన నివాళులని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంతనూతలపాడు బస్టాండ్‌లో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణితో పాటు పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పేర్నమిట్టలో...

పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఎన్‌సీసీ ఆఫీసర్ బీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు.

మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలో ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో శక్తి సదన్ ఆశ్రమంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళలు, అభ్యుదయ సమితి సభ్యులు పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు రోడ్లను శుభ్రం చేశారు. సమితి డైరెక్టర్ శాంతిలత, సీహెచ్ దుర్గ, వేమా సుశీల, గుంటుపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: సమాజ హితం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మండలంలోని బీ నిడమానూరు, వినోదరాయునిపాలెం గ్రామాల సర్పంచ్‌లు వడ్డిముక్కల శ్రీను, ఘట్టమనేని అశోక్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. బీ నిడమానూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనుతో కలిసి పిచ్చిమొక్కలు తొలగించారు. వినోదరాయునిపాలెం గ్రామంలో సర్పంచ్ పరిసరాలను శుభ్రం చేయించి గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటప్పయ్య, పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మోటుమాలలో...

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, సర్పంచ్ కోడూరి గోపి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ వి.అరుణకుమారి, సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకారెడ్డి, ఉపాధ్యాయులు ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. స్కూల్ విద్యార్థినులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురించి, పరిశుభ్రత, చెత్త రహిత ఆంధ్రప్రదేశ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, బాలికలు, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.



ఇనమనమెళ్లూరులో పాల్గొన్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గ్రామస్తులు



సంతనూతలపాడులో పాల్గొన్న దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ, సర్పంచ్



బీ నిడమానూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న సర్పంచ్, ఎన్‌సీసీ విద్యార్థులు



ఒంగోలులో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న మహిళాభ్యుదయ సమితి సభ్యులు



జైలు ఆవరణను పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది



మోటుమాల కేజీబీవీలో పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఒంగోలు అభివృద్ధిని తల్లిదండ్రులకు చెప్పండి

- విద్యార్థులతో కమిషనర్ వెంకటేశ్వరరావు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలు నగరంలో చేసిన అభివృద్ధిని తల్లిదండ్రులకు విద్యార్థులు చెప్పాలని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దేశభక్తి వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసంగిస్తూ నగర పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. మతవిద్వేషాలకు దూరంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించడమే దేశభక్తికి నిదర్శనమన్నారు. విద్యార్థులు సోదర భావంతో మెలగాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో దేశభక్తి పేరుతో జరుగుతున్న విద్వేషాలను, మత కల్లోలాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని జేవీవీ జిల్లా సీనియర్ నాయకుడు ఏవీ పుల్లారావు పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ నిబద్ధతను వివరించారు. మతములన్నీ మాసిపోవాలని, ప్రజలంతా కలగలసి జీవించాలని కోరారు. విద్యార్థుల్లో సామాజిక అంశాలపై ఆసక్తి, సైన్స్‌పై అవగాహన కల్పించడమే జేవీవీ ఏకైక లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా నగర స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, వెంకటేష్, ఎస్.శ్రీనివాస్, లక్ష్మీదుర్గ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జూనియర్ చాంబర్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన చాంబర్ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీరామ్ హైస్కూల్లో నిర్వహించిన సమావేశానికి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. చాంబర్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు, ఇతర అజెండా అంశాలపై చర్చించారు. నూతన అధ్యక్షునిగా కొనంకి వెంకట వరుణ్‌కుమార్, కార్యదర్శిగా సింగమనేని పార్థసారథి, కోశాధికారిగా నరేంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమకు అవకాశం కల్పించినందుకు నూతన కార్యవర్గ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. చాంబర్ అభ్యున్నతికి కృషి చేస్తామని, చాంబర్ ద్వారా యువతకు వ్యక్తిగత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ కొండలు, రవికుమార్, వీవీ రమణ, శివప్రసాద్, రాజేష్, కూరపాటి రమేష్, అద్దంకి శ్రీనివాసరావు, కసిబిసి నాగేశ్వరరావు, రవీంద్ర, బెడవాడ పవన్‌కుమార్, ఎం.శేఖర్‌బాబు, రామకృష్ణ, దాది ఆంజనేయులు, జాలిరెడ్డి, శ్రీరాములురెడ్డి, బొమ్మల శ్రీనివాసరావు, ఎస్‌డీ ఇస్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

డాడ్జ్‌బాల్ పోటీల్లో చీమకుర్తి విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన చీమకుర్తి విద్యార్థినులు

చీమకుర్తి: రాష్ట్రస్థాయిలో ఆదివారం జరిగిన డాడ్జ్ బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించగా, ఈ జట్టులోని 12 మంది బాలికల్లో చీమకుర్తి జెడ్పీ హైస్కూలు విద్యార్థినులు నలుగురు ఉన్నారు. ప్రియాంక, అనూష, పవిత్ర, రూప ప్రతిభ చూపి జట్టు గోల్డ్‌మెడల్ సాధించేందుకు తోడ్పడ్డారని చీమకుర్తి జిల్లా పరిషత్ హైస్కూలు పీడీ డీ స్వరూపావాణి తెలిపారు. బాపట్ల జిల్లా చిలుమూరులో ఈ పోటీలు జరిగాయని చెప్పారు. నలుగురు క్రీడాకారిణులను, పీడీ స్వరూపావాణిని హెచ్‌ఎం, టీచర్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేజీబీవీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇండియా ట్రూప్ ఎంపిక



స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇండియా ట్రూప్‌కు ఎంపికైన విద్యార్థినులు

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాల కేజీబీవీలో హెచ్‌ఎం వి.అరుణకుమారి ఆధ్వర్యంలో ఆదివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇండియా ట్రూప్‌ను ఎంపిక చేశారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పాల్గొని మాట్లాడుతూ బాలికలు స్కౌట్‌లో చేరడం వలన దేశభక్తి, క్రమశిక్షణ, సేవాగుణం అలవరతాయన్నారు. 32 మంది విద్యార్థినులతో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇండియా ట్రూప్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహాన్ని ప్రారంభించిన ప్రణీత్‌రెడ్డి



జగనన్న కాలనీలో గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న బాలినేని ప్రణీత్ రెడ్డి, లంకపోతు అంజిరెడ్డి

రంగాయపాలెం (కొత్తపట్నం): ప్రభుత్వం ద్వారా జగనన్న కాలనీలో లబ్ధిదారుడు నిర్మించుకున్న గృహాన్ని వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రంగాయపాలెం పంచాయతీలో 1.50 ఎకరాల స్థలంలో 63 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అన్ని గృహాలు పూర్తి చేశారు. అందులో షేక్ అజీమ్ ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా ప్రారంభించిన ప్రణీత్‌రెడ్డి, అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలం కొనుగోలు చేసి మరీ అర్హులైన ప్రతి కుటుంబానికి మహిళల పేరుమీద పట్టా ఇవ్వడం జరిగిందన్నారు. అంతేగాకుండా ఇల్లు కూడా నిర్మించి సొంతింటి కళ నేరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, ముసలారెడ్డి, కరిముల్లా, ములకా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం



స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

ఒంగోలు రూరల్: స్వాతంత్య్ర సమరయోధులకు ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పసుపులేటి మురళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ విశ్వేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఎలక్షన్ డీటీ గోపి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయపాటి అంకయ్యకు సన్మానం...

ఒంగోలు నగరం రెండో డివిజన్ అధ్యక్షునిగా ఎంపికైన రాయపాటి అంకయ్యను ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అంకయ్య నివాళి అర్పించారు. తనకు పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయపాటి అంకయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు, నాయకులు